క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

వాంకిడి: మండల వ్యాప్తంగా నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏడీఈ శ్రీనివాస్, ఏఈ శ్రీకాంత్ ఓ ప్రకటనలో తెలిపారు. మండల కేంద్రంలోని 33 కేవీ విద్యుత్ లైన్‌లో మరమ్మతుల కారణంగా సోమవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు పేర్కొన్నారు.

పంచాయతీ భూములు ఆక్రమిస్తే చర్యలు



పంచాయతీ స్థలంలో వేసిన ఫెన్సింగ్

పెంచికల్‌పేట్: గ్రామపంచాయతీ భూములను ఆక్రమిస్తే పంచాయతీ రాజ్ చట్టం ప్రకారం చర్యలు తీసుకుంటామని ఎల్కపల్లి పంచాయతీ కార్యదర్శి కుకిడే చంద్రశేఖర్ అన్నారు. ఆదివారం ఎల్కపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని పెంచికల్‌పేట్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ముందు ఖాళీగా ఉన్న స్థలంలో కొంత మంది వ్యక్తులు పోల్స్ వేసి, పెన్సింగ్ వేశారనే సమాచారంతో ఆయన పరిశీలించారు. పంచాయతీ స్థలంలో ఆక్రమణలు తొలగించాలని సూచించినా పట్టించుకోవడం లేదని, సదరు వ్యక్తులపై ఉన్నత అధికారులకు ఫిర్యాదు చేసినట్లు పేర్కొన్నారు.

ఉచిత వైద్యశిబిరానికి స్పందన



వైద్యపరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు శ్రీనివాస్, అనిత

కాగజ్‌నగర్‌రూరల్: ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా ఆదివారం మండలంలోని నజ్రూల్‌నగర్ వేదమందిర్ వద్ద కిమ్స్ మల్టీస్పెషాలిటీ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. శిబిరంలో 300 మంది వ్యాధిగ్రస్తులకు వైద్యపరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఆస్పత్రి మేనేజింగ్ డైరెక్టర్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ కొత్తపల్లి శ్రీనివాస్, అనిత మాట్లాడుతూ పేద ప్రజలకు నాణ్యమైన వైద్యసేవలు అందించడంలో తమ వంతు కృషి చేస్తున్నామన్నారు. వైద్యులు వెంకటేశ్, రామ్మూర్తి, చంద్రకుమార్, విజయ్ రోగులను పరీక్షించి వైద్యం అందించారు. నాయకులు కాళిదాస్, ముజుందర్, బిశ్వాస్, అమిత్, గరామి, రాకేశ్ తదితరులు పాల్గొన్నారు.

మద్యం తాగి వాహనాలు నడిపితే చర్యలు



మాట్లాడుతున్న ఎస్సై చంద్రశేఖర్

రెబ్బెన: మద్యం తాగి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తప్పవని ఎస్సై చంద్రశేఖర్ హెచ్చరించారు. ఆదివారం గోలేటిలో డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ అధిక శాతం రోడ్డు ప్రమాదాలు మద్యం సేవించి వాహనాలు నడపడం వల్లనే జరుగుతున్నాయన్నారు. మద్యం సేవించి వాహనాలు నడిపితే జరిమానాతో పాటు జైలుశిక్ష తప్పదని హెచ్చరించారు. సెల్‌ఫోన్ మాట్లాడుతూ వాహనాలు నడపొద్దని, మైనర్లకు వాహనాలు అప్పగించొద్దని సూచించారు. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నియమాలు తప్పకుండా పాటించాలన్నారు.

ప్రజలు నిర్భయంగా ఓటు వేయాలి



ఫ్లాగ్‌మార్చ్ చేస్తున్న సీఐ సాదిక్‌పాషా

కౌటాల: ప్రజలు నిర్భయంగా తమ ఓటు హక్కు వినియోగించుకోవాలని సీఐ సాదిక్‌పాషా అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో కేంద్ర సాయుధ బలగాలతో కలిసి పోలీసులు కవాతు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రశాంత వాతావరణంలో పార్లమెంట్ ఎన్నికలు నిర్వహించడమే లక్ష్యంగా కేంద్ర సాయుధ బలగాలతో ఫ్లాగ్‌మార్చ్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఎన్నికల నిర్వహణలో భాగంగా ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులో ఉంటుందని ప్రజలు ఈమేరకు నడుచుకోవాలన్నారు. ఎస్సై మధుకర్ పాల్గొన్నారు.

ప్రభుత్వ స్థలాలు కబ్జా

- దశాబ్దాల క్రితం భూములు విరాళంగా ఇచ్చిన దాతలు
- అప్పట్లోనే భవనాలు నిర్మించిన ప్రభుత్వం
- శిథిలావస్థకు చేరడంతో కూల్చి కబ్జా చేస్తున్న అక్రమార్కులు
- పట్టించుకోని అధికారులు



బెజ్జూర్‌లో కబ్జాకు గురైన ప్రభుత్వ భవనం (ఫైల్)

బెజ్జూర్: ప్రజాఅవసరాలు, ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలల నిర్మాణం కోసం దశాబ్దాల క్రితం మండల కేంద్రంలో దాతలు భూములను విరాళంగా అందించారు. దీంతో ఆయా స్థలాల్లో అప్పట్లో ప్రభుత్వం భవనాలు నిర్మించింది. ప్రస్తుతం భవనాలు శిథిలావస్థకు చేరుకోవడం, వాటి గురించి పట్టించుకునే నాథుడు లేకపోవడంతో అవి కాస్త ఆక్రమణలకు గురవుతున్నాయి. మండలంలో కొంత మంది అక్రమార్కులు భవనాలను కూల్చివేసి స్థలాలను ఆక్రమించుకున్నారు. ప్రభుత్వ భూములను కాపాడాల్సిన రెవెన్యూ అధికారులు అక్రమార్కులకు వంత పాడుతూ సహకరిస్తున్నారనే ఆరోపణలు విన్పిస్తున్నాయి. అసైన్డ్ భూముల కబ్జా జరుగుతున్నా, అక్రమంగా భవన నిర్మాణాలు చే స్తున్నా ఏ ఒక్క అధికారి అటువైపు కన్నెత్తి చూడకపోవడంపై ప్రజలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.

ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం..

మండలంలో ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం అవుతున్నాయి. సలుగుపెల్లి ప్రధాన చౌరస్తా వద్ద దాదాపు 15 ఏళ్లం క్రితం నిర్మించిన మినీ బస్టాండ్ ఆక్రమణకు గురైనప్పటికీ అడిగేవారు కరువయ్యారు. పెద్ద సిద్దాపూర్ గ్రామపంచాయతీ పరిధిలోని రంగాపూర్ గ్రామంలో కొన్నేళ్ల క్రితం నిర్మించిన ప్రభుత్వ పాఠశాల శిథిలావస్థకు చేరుకోవడంతో పూర్తిగా నేలమట్టం చేసి స్థలాన్ని అక్రమార్కులు కబ్జా చేశారు. లంబాడిగూడ గ్రామంలో ప్రభుత్వ పాఠశాల భవనాన్ని తొలగించి ఆక్రమణకు గురిచేస్తున్నట్లు తహసీల్దార్‌కు సైతం ఫిర్యాదులు అందినా పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. మండల కేంద్రంతో పాటు సలుగుపల్లి, తదితర ప్రధాన చౌరస్తాల్లో భూముల ధరలు పెరగడంతో ఎలాంటి అనుమతులు తీసుకోకుండా అసైన్డ్ భూములను అక్రమార్కులు విచ్చలవిడిగా విక్రయాలు చేస్తున్నారు.

అడ్డుకట్ట పడేనా..

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక భూ కబ్జాలకు అడ్డుకట్ట వేస్తామని సీఎం చెబుతున్నప్పటికీ భూ ఆక్రమణలు ఆగకపోవడం గమనార్హం. ఆక్రమణదారులపై ఎలాంటి కేసులు నమోదు చేయకపోవడంతోనే భూ కబ్జాదారులు మరింత రెచ్చిపోతున్నారు. ఎక్కడైనా ప్రభుత్వ స్థలం ఖాళీగా కనిపిస్తే చాలు అక్కడ వాలిపోతున్నారు. అక్రమార్కులు కబ్జాలకు పాల్పడుతుంటే ప్రభుత్వ యంత్రాంగం 'మామూలు'గా తీసుకుంటున్నారనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. మండలంలో ప్రభుత్వ భూములు కబ్జాకు గురైనా పట్టించుకున్న దాఖలాలు లేవు. భవిష్యత్తులో మండలంలో ప్రభుత్వ భవనాలు మంజూరైతే వాటి నిర్మాణానికి గుంట భూమి కూడా లేకుండా పోయే ప్రమాదం ఉందని మండల వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత అధికార పార్టీ అండదండలతో మండలంలో చాలా అసైన్డ్ భూములు కబ్జా కోరల్లో ఉన్నాయని, వాటిని తిరిగి స్వాధీనం చేసుకొని ప్రజా ప్రయోజనాల కోసం వినియోగించాలని మండల వాసులు కోరుతున్నారు. ఈ విషయమై తహసీల్దార్ భువనేశ్వర్‌ను వివరణ కోరగా ఆక్రమణ జరిగితే ప్రభుత్వ భూములు స్వాధీనం చేసుకుంటామన్నారు.

నిఘా నేత్రాలున్నాయి.. జాగ్రత్త

- స్క్వాడ్ వాహనాలకు సీసీ కెమెరాలు



కారుపై అమర్చిన సీసీ కెమెరా

కెరమెరి: మే 13న జరగనున్న పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో అధికారులు విస్తృత వాహనాల తనిఖీలు చేపడుతున్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అన్ని రకాల చర్యలు చేపడుతున్నారు. ఇప్పటికే జిల్లాలోని ప్రతీ ప్రాంతాన్ని, మార్గాలను తమ ఆధీనంలోకి తీసుకున్నారు. ఫ్లయింగ్ స్క్వాడ్ తిరిగే వాహనాలకు సీసీ కెమెరాలు సైతం ఏర్పాటు చేశారు. ఈ వాహనం సంచరించే వేళ సీసీ కెమెరాలు 360 డిగ్రీల్లో తిరుగుతూ నిఘా పెడతాయి. వాటి ద్వారా సేకరించిన ఫుటేజీలను మండల, జిల్లా స్థాయిల్లో ఉండే అధికారులు తమ కార్యాలయాల్లో వీక్షిస్తారు. మండలంలో మూడు ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు ఉన్నాయి. మండలంలో 29 పోలింగ్ కేంద్రాలు ఉండగా, 23,198 మంది ఓటర్లు ఉన్నారు.

1950 టోల్ ఫ్రీ నంబర్

ఎన్నికల నిర్వహణలో ఏవైనా ఇబ్బందులు ఉంటే వెంటనే టోల్ ఫ్రీ నంబర్ 1950కి ఫోన్ చేసి సమాచారం ఇవ్వొచ్చు. మారణాయుధాలు కలిగి ఉండడం, మద్యం, మాదక ద్రవ్యాల పంపిణీ, నగదు పంపిణీ, ప్రజల ఆస్తులను ధ్వంసం చేయడం, అసత్య వార్తలను ప్రసారం చేయడం, ఓటర్ల రవాణా, ప్రలోభపెట్టే వస్తువుల పంపిణీ, చెల్లింపు వార్తలు, కుల, మత ద్వేషాలు రెచ్చగొట్టే ప్రసంగాలు, ఓటర్లను బెదిరించడం వంటివి ఎవరి దృష్టికైనా వస్తే వెంటనే టోల్ ఫ్రీ నంబర్‌కు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలని అధికారులు పేర్కొంటున్నారు.

అంబేద్కర్ జయంతి విజయవంతం చేయాలి



బెజ్జూర్: అంబేద్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న కమిటీ సభ్యులు



కౌటాల: పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఉత్సవ కమిటీ సభ్యులు

బెజ్జూర్: సిర్పూర్ నియోజకవర్గ అంబేద్కర్ జయంతి ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఈనెల 14న కాగజ్‌నగర్ పట్టణంలో అంబేద్కర్ 133వ జయంతి సందర్భంగా నిర్వహించనున్న ఉత్సవ ర్యాలీలో పాల్గొని విజయవంతం చేయాలని కమిటీ అధ్యక్షులు కుడుక శ్రీనివాస్, డోంగ్రె సునీల్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని బుద్ధ విహార్ వద్ద అంబేద్కర్ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. వారు మాట్లాడుతూ ర్యాలీలో పాల్గొనేందుకు ఆయా మండలాలల నుంచి వచ్చే ఉపాసిక, ఉపాసకులకు అన్ని వసతులు కల్పించనున్నట్లు తెలిపారు. కమిటీ ఉపాధ్యక్షుడు పర్స వెంకటేశ్, కడారి శ్రీనివాస్, చల్లూర్కార్ లింగయ్య, కోశాధికారి జాడి శివరాం, సలహాదారులు రత్నం శ్రీకాంత్, సదాశివ్, మండల కమిటీ సభ్యులు కుమ్మరి పోశన్న, దుర్గం దేవాజి తదితరులు పాల్గొన్నారు.

14న ఉత్సవ ర్యాలీ

కౌటాల: అంబేద్కర్ 133వ జయంతి పురస్కరించుకొని కాగజ్‌నగర్ పట్టణంలో ఈ నెల 14న నిర్వహించనున్న ఉత్సవ ర్యాలీని మహర్ కులస్తులు విజయవంతం చేయాలని అంబేద్కర్ జయంతి ఉత్సవ కమిటీ సభ్యులు అన్నారు. ఆదివారం కౌటాల మండల కేంద్రంలోని జెత్వన్ బుద్ధ విహార్‌లో ఉత్సవ ర్యాలీ పోస్టర్ ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ కాగజ్‌నగర్ పట్టణంలో ఈ నెల 14న సాయంత్రం 4 గంటలకు స్థానిక లారీ చౌరస్తా నుంచి ఉత్సవ ర్యాలీ ఉంటుందన్నారు. చలో కాగజ్‌నగర్ కార్యక్రమంలో నియోజకవర్గంలోని మహర్ కులస్తులు, అంబేద్కర్ అభిమానులు సకాలంలో అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు జాడి శివరాం, శ్రీనివాస్, సునీల్, శ్రీకాంత్, సదాశివ్, మారుతి, మాణిక్, వెంకటేశ్, శంకర్, సదాశివ్, విఠల్ తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ వేతనాలు చెల్లించాలి



వినతిపత్రం అందజేస్తున్న కార్మికులు

దహెగాం: గత నాలుగు నెలల నుంచి వేతనాలు అందకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని మిషన్‌భగీరథ కార్మికులు లైన్‌మెన్, ఆపరేటర్‌లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా మండలంలో మిషన్‌భగీరథలో పని చేస్తున్న కార్మికులు ఆదివారం మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ వేతనాలు అందక కుటుంబాన్ని పోషించుకోవడంలో ఇబ్బందులు పడుతున్నామన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి పెండింగ్ వేతనాలు విడుదల చేయాలని కోరారు. కార్యక్రమంలో కార్మికులు తిరుపతి, నాగరాజు, బాపురావ్, సురేశ్, కృష్ణ, విజయ్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

బొగ్గు ఉత్పత్తి సాధించిన కార్మికులకు ఇంటి స్థలం ఇవ్వాలి



సమావేశంలో మాట్లాడుతున్న బోగే ఉపేందర్

రెబ్బెన: సింగరేణి వార్షిక బొగ్గు ఉత్పత్తిని సాధించిన సందర్భంగా కార్మికులకు ఇంటి స్థలంతో పాటు ఇంటి నిర్మాణానికి వడ్డీ లేని రుణాలు మంజూరు చేయాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బోగే ఉపేందర్ డిమాండ్ చేశారు. ఆదివారం హైదరాబాద్‌లో నిర్వహించిన ఏఐటీయూసీ రాష్ట్ర కౌన్సిల్ సమావేశానికి హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ కార్మికులకు జీవో నంబర్ 22 ప్రకారం వేతనాలు అందించాలని డిమాండ్ చేశారు. సింగరేణిలో అత్యధిక ఉత్పత్తిని సాధించిన కార్మికులకు తీపి గుర్తుగా 250 గజాల ఇంటి స్థలాన్ని కేటాయించి, ఇంటి నిర్మాణానికి రూ.30లక్షల వడ్డీ లేని రుణం బహుమతిగా అందించాలని కోరారు.

ఆలయంలో సామూహిక రుద్రాభిషేకం



రుద్రాభిషేకంలో పాల్గొన్న భక్తులు

దహెగాం: మండలంలోని లగ్గాం గ్రామంలో గల ఉమాచంద్రశేఖర స్వామి ఆలయంలో ఆదివారం మాసశివరాత్రి పురస్కరించుకొని ఏకాదశ సామూహిక రుద్రాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకుడు శ్రీకాంత చారి ఆధ్వర్యంలో వేదపండితులు ఉదయం నుంచి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అభిషేకంలో లగ్గాం గ్రామంతో పాటు మండల కేంద్రం నుంచి భక్తులు పాల్గొన్నారు.

'ఉత్సవాలు విజయవంతం చేస్తాం'



సమావేశంలో పాల్గొన్న ఆలయ కమిటీ సభ్యులు

రెబ్బెన: భక్తుల సహకారంతో శ్రీరామ నవమి ఉత్సవాలను విజయవంతం చేస్తామని కోదండ రామాలయ కమిటీ సభ్యులు అన్నారు. ఆదివారం ఆలయ ప్రాంగణంలో కమిటీ సమావేశం నిర్వహించారు. సమావేశానికి పూర్తిస్థాయిలో సభ్యులు హాజరు కాకపోవటంతో నూతన ఆలయ కమిటీ ఎన్నిక కార్యక్రమాన్ని వాయిదా వేశారు. సభ్యులు మాట్లాడుతూ భక్తుల సహకారంతో శ్రీరామనవమి ఉత్సవాలతో పాటు, హనుమాన్ జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. సభ్యులు శ్రీధర్, వినోద్ జైస్వాల్, లోకేష్ నాయుడు, శ్రీనివాస్, సాయి కిరణ్, ఫణికుమార్, ప్రవీణ్‌కుమార్, నవీన్‌కుమార్, వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

9న ఉగాది సంబరాలు

కాగజ్‌నగర్‌రూరల్: పట్టణంలోని భట్‌పల్లి చౌరస్తాలో గల మున్నూరు కాపు సంఘ భవనంలో ఈనెల 9న ఉదయం 9 గంటలకు ఉగాది సంబరాలు నిర్వహించనున్నట్లు మున్నూరు కాపు సంఘం సిర్పూర్ నియోజకవర్గ అధ్యక్షుడు కలికోట రమణయ్య తెలిపారు. నియోజకవర్గంలోని అన్ని మండలాల మున్నూరు కాపు కులస్తులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని ఆయన కోరారు.

చికిత్స పొందుతూ యువకుడు మృతి

రెబ్బెన: మండలంలోని వంకుల శివారులో బైక్ అదుపు తప్పి బోల్తాపడిన సంఘటనలో తీవ్రంగా గాయపడిన ఎల్లారి ఈశ్వర్ (20) చికిత్స పొందుతూ శనివారం మృతి చెందినట్లు ఎస్సై చంద్రశేఖర్ ఆదివారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం ఈనెల 4వ తేదీన తాండూర్ మండలం కొత్తపెల్లికి చెందిన ఎల్లారి ఈశ్వర్, స్నేహితులు బుర్స భీమేశ్, కలబోయిన శ్రావణ్‌లు కాగజ్‌నగర్‌లో ఫంక్షన్‌కు హాజరయ్యేందుకు బైక్‌పై బయలుదేరారు. అతివేగంగా, నిర్లక్ష్యంగా శ్రావణ్ బైక్‌ను నడుపగా వంకులం శివారులో అదుపు తప్పి బోల్తాపడింది. ప్రమాదంలో ముగ్గురికి గాయాలు కాగా, ఈశ్వర్‌ను కాగజ్‌నగర్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చేర్పించారు. మెరుగైన వైద్యం కోసం మంచిర్యాలకు అక్కడి నుంచి వరంగల్‌లోని ఎంజీఎంకు తరలించగా చికిత్స పొందుతూ శనివారం సాయంత్రం మృతి చెందాడు. మృతుడి తండ్రి బాపు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

పరీక్ష తేదీల్లో మార్పు



కేజీబీవీలో చదువుకుంటున్న విద్యార్థినులు

- 15 నుంచి 22 వరకు ఎస్ఏ -2 పరీక్షలు

కెరమెరి: పాఠశాలల్లో విద్యార్థుల వార్షిక పరీక్షల తేదీల్లో విద్యాశాఖ మార్పులు చేసింది. సమ్మెటీవ్ అసెస్‌మెంట్(ఎస్ఏ-2) పరీక్షలను ఈనెల 15 నుంచి 22 వరకు నిర్వహించనున్నారు. పాత షెడ్యూల్ ప్రకారం ఈనెల 8 నుంచి 20 వరకు పరీక్షలు జరగాల్సి ఉంది. కానీ ఎండ తీవ్రత పెరుగుతుండడం, పాత షెడ్యూల్‌లో పరీక్షల మధ్య గ్యాప్ ఎక్కువగా రావడంతో మార్పులు చేసినట్లు తెలుస్తోంది. జిల్లాలో అన్ని యాజమాన్యాల కింద పని చేస్తున్న పాఠశాలలు 1263 ఉండగా, 82 వేల మంది విద్యార్థులు ఉన్నారు. 22న పరీక్షలు ముగియగానే 23న ఫలితాలు వెల్లడించనున్నారు. అదే రోజు పరీక్షల మూల్యాంకణం చేసి క్యుములేటివ్ రికార్డుల్లో నమోదు చేయనున్నారు. అదే రోజు తల్లిదండ్రుల సమావేశం నిర్వహించి విద్యార్థుల ప్రోగ్రెస్ కార్డులు అందించనున్నారు.

'అన్ని వర్గాల అభ్యున్నతి కాంగ్రెస్‌తోనే సాధ్యం'

జైనూర్: అన్ని వర్గాల అభ్యున్నతి కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమవుతుందని ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్, ఎంపీ అభ్యర్థి సుగుణ అన్నారు. ఆదివారం మండలంలోని జంగాం గ్రామంలో ప్రచారానికి వచ్చిన వారికి ఆదివాసీ నాయకులు ఘన స్వాగతం పలికారు. వారు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ప్రచారంలో ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా నెరవేరుస్తుందన్నారు. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి ఆత్రం సుగుణను ఓటు వేసి గెలిపించాలని నాయకులు కోరారు.

బార్ అసోసియేషన్ అధ్యక్షుడికి సన్మానం



సన్మానిస్తున్న మేరు సంఘం ప్రతినిధులు

ఆసిఫాబాద్అర్బన్: ఆసిఫాబాద్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా ఇటీవల నూతనంగా ఏకగ్రీవంగా ఎన్నికైన న్యాయవాది రాపర్తి రవీందర్‌ను ఆదివారం జిల్లా కేంద్రంలో పట్టణ మేరు సంఘం ఆధ్వర్యంలో శాలువాతో ఘనంగా సన్మానించారు. సంఘం అధ్యక్షుడు రామగిరి అశోక్, మాజీ అధ్యక్షుడు రాపర్తి శ్రీనివాస్, నాయకులు సత్యనారాయణ, సురేశ్, గణేశ్, నాగేశ్, పోచన్న, శంకర్, సభ్యులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ



పరామర్శిస్తున్న ఎమ్మెల్యే కోవ లక్ష్మి

లింగాపూర్: మండల కేంద్రంలో గత నెల 29న రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన పవన్, సాయిచరణ్‌ల కుటుంబ సభ్యులను ఆదివారం ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి పరామర్శించారు. కార్యక్రమంలో సరస్వతి, జాటోత్ రాహుల్, వినోద్, కైలాస్, గణపతి, రవీందర్, బీఆర్ఎస్ కార్యకర్తలు ఉన్నారు.

'సమస్యల పరిష్కారానికి చర్యలు చేపడుతాం'

జైనూర్: ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు చేపడుతామని ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి అన్నారు. ఆదివారం మండలంలోని రాసిమెట్ట గ్రామంలో జరిగిన వివాహ కార్యక్రమానికి హాజరయ్యారు. ఆమె మాట్లాడుతూ ప్రజలకు నీటి ఎద్దడి లేకుండా నివారించేందుకు నూతన బోరు బావులు తవ్వించడంతో పాటు ఆయా గ్రామాల్లో అదనపు ట్యాంకుల నిర్మాణం చేపడుతున్నామన్నారు. బీఆర్ఎస్ నాయకురాలు మర్సుకోల సరస్వతి, మాజీ సర్పంచ్ సయాయజీ, దుందేరావు తదితరులు ఉన్నారు.

బస్ సౌకర్యం లేక సింగరేణి ఉద్యోగుల వెతలు



గోలేటి టౌన్‌షిప్‌కు నడిచిన ఆర్టీసీ బస్సు (ఫైల్)

బెల్లంపల్లి: సింగరేణి కార్మికులకు ఆర్టీసీ బస్ సర్వీసు కరువైంది. రెబ్బెన మండలం గోలేటి టౌన్‌షిప్ కేంద్రంగా నిర్వహిస్తున్న బెల్లంపల్లి ఏరియా సింగరేణి జనరల్ మేనేజర్ కార్యాలయం ఉద్యోగులు, సిబ్బంది, బొగ్గు గనుల్లో విధులు నిర్వహించే కార్మికులు, సాధారణ పౌరులు బస్సు సౌకర్యం లేక నానా యాతన పడుతున్నారు. బెల్లంపల్లి నుంచి రోజువారీగా 50మందికిపైగా ఉద్యోగులు, సిబ్బంది జీఎం కార్యాలయానికి వెళ్లి విధులు నిర్వహిస్తుండగా అనేక మంది కార్మికులు బొగ్గు గనులు, విభాగాల్లో పనిచేస్తున్నారు. వీరి సౌలభ్యం కోసం గతంలో బస్సు సర్వీసును మంచిర్యాల డిపో అధికారులు నడిపించగా, ఆ తర్వాత అర్థంతరంగా రద్దు చేశారు. 2022 డిసెంబర్ 31నాటి వరకు నడిపించి బస్సు సర్వీసును నిలిపివేశారు. అప్పటి నుంచి కార్మికులు ఎండ, వానను లెక్క చేయకుండా అష్టకష్టాలు పడుతూ, ద్విచక్ర వాహనంపై రాకపోకలు చేస్తున్నారు. జాతీయ రహదారి మీదుగా వెళ్లాల్సి వస్తుండటంతో వేగంగా వెళ్తున్న వాహనాలతో తీవ్రంగా భయపడుతున్నారు. మహిళల పరిస్థితి మరీ దారుణం. ప్రైవేట్ వాహనాల్లో లేదా సహచర ఉద్యోగుల వాహనాలపై వెళ్లి విధులు నిర్వహించాల్సి వస్తోంది. కొందరు ఆర్టీసీ బస్సుల్లో గోలేటి క్రాస్ రోడ్ వరకు వెళ్లి అక్కడి నుంచి ఆటోల్లో జీఎం కార్యాలయానికి వెళ్తున్నారు. తద్వారా అధిక చార్జీని చెల్లించి నష్టపోతున్నారు. ఖైరిగూడ, డోర్లి ఓపెన్‌కాస్ట్ గనులకు వెళ్లే కార్మికులు మరిన్ని కష్టాలను అనుభవిస్తున్నారు. కాగా గోలేటి టౌన్‌షిప్ నుంచి అనేక మంది పౌరులు వివిధ అవసరాల కోసం బెల్లంపల్లికి దినాం వచ్చి పోతుంటారు. వీరికి సైతం బస్సు సౌకర్యం లేకపోవడంతో ఇక్కట్లు పడుతున్నారు. ప్రైవేట్, సొంత వాహనాల్లో రాకపోకలు సాగిస్తుండటం వల్ల ఒక్కోసారి ప్రమాదాలకు గురవుతున్న ఘటనలు చోటు చేసుకుంటున్నాయి. సింగరేణి కా ర్మికులు, మహిళ ఉద్యోగులు, పౌరులు పడుతున్న ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని ఆర్టీసీ అధికారులు ఉదయం, సాయంత్రం వేళల్లో ఉద్యోగుల సమయపాలనకు అనుగుణంగా బస్సు సర్వీసును నడిపించి ఇబ్బందులు తీర్చాలని కోరుతున్నారు. ఉద్యోగుల ప్రయాణకష్టాలపై బెల్లంపల్లి ఎమ్మెల్యే వినోద్ దృష్టిసారించి సానుకూలంగా స్పందించాలని కోరుతున్నారు.